క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

లక్ష్మణచాంద: సాధారణ మరమ్మతుల్లో భాగంగా మండలంలోని రాచాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో ఉన్న సబ్‌స్టేషన్ పరిధిలో దిలావర్‌పూర్, మాడేగాం, కదిలి, న్యూలోలం గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 నుండి 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గోదావరిలో తెప్ప పూజలు



నది వద్దకు తెప్పలతో వెళ్తున్న మహిళలు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి వంతెన వద్ద గోదావరి నదిలో శుక్రవారం మహిళలు తెప్ప పూజలు నిర్వహించారు. మహిళలు నదిలో పుణ్యస్నానాల అనంతరం తెప్ప పూజలు చేసి గంగాదేవికి హారతినిచ్చారు. తర్వాత నదిలో తెప్పలను విడిచి అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

గురుపౌర్ణమి వేడుకలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ గండిరామన్న దత్తసాయి మందిరంలో శుక్రవారం గురుపౌర్ణమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా సాయి దీక్ష సేవాసమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి, ఆలయ ఈవో రమేశ్, అర్చకుల వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. 24 గంటల అఖండసాయి నామం ప్రారంభమవగా భక్తులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో మాక్ పోలింగ్



ఓటు వేస్తున్న విద్యార్థి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. చైర్మన్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటుహక్కు విలువైందని.. ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఇందులో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

ఖానాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో శుక్రవారం ఏఎస్సై శ్రీనివాస్‌వర్మ ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేసి ధ్రువపత్రాలు పరిశీలించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని.. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వర్షానికి కూలిన ఇంటి గోడ



కూలిన ఇంటి గోడ వద్ద బాధితుడు

పెంబి: మండలంలో గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి తులసీపేట గ్రామంలోని గుగ్లావత్ సుభాశ్ ఇంటి గోడ రోడ్డు పక్కన కూలింది. రాత్రి అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

'ఉపాధి' గ్రామసభలు

లోకేశ్వరం: అర్హులైన ఉపాధి కూలీలకు జాబ్ కార్డులు అందించాలని సామాజిక తనిఖీ ఎస్సార్పీ సురేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని గొడిసెరా, పుస్పూర్, సాథ్గాం గ్రామాల్లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. ఎస్సార్పీ మాట్లాడుతూ పనులకు వచ్చిన కూలీలు మాస్టర్ రోల్‌లో సంతకాలు చేయాలన్నారు. పుస్పూర్‌లో రూ.18లక్షలు, సాథ్గాంలో రూ.16లక్షల పనులకు సంబంధించి తనిఖీలు నిర్వహించారు. ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, ఎస్సార్పీ భగవాన్, డీఆర్పీ రమేశ్, వెంకటేశ్, టీఏలు రవీందర్, హరిత, శారద, ఎఫ్ఏలు అంజన్‌రెడ్డి, సాయినాథ్, సాయన్న ఉన్నారు.

ఆలయ కమిటీ కార్యవర్గం

ఖానాపూర్: పట్టణంలోని తిమ్మాపూర్ పరిధిలో ఉన్న నల్లపోచమ్మ ఆలయ కమిటీ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కల్వకుంట్ల నారాయణరావు, గౌరవ అధ్యక్షుడిగా కావలి సంతోశ్, ప్రధాన కార్యదర్శిగా బక్కశెట్టి లక్ష్మణ్, కోశాధికారిగా సిరిపురం నాగరాజు, ఉపాధ్యక్షులుగా బీసీ రాజన్న, ఇస్తారి రాములు, సహాయ కార్యదర్శిగా రాచమల్ల రాజశేఖర్, ఉప కోశాధికారిగా దేవల్ల రాజేశ్వర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కొండ ప్రశాంత్, ప్రచార కార్యదర్శిగా గంగాధర్, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

తండా రోడ్లకు మహర్దశ

- ఎస్టీ ఎస్‌డీఎఫ్‌తో నిర్మాణాలు
- ప్రజలకు తీరనున్న రవాణా కష్టాలు



కమల్‌కోట్ నుంచి గుమ్మిర్యాల్‌తండా వెళ్లే రోడ్డు



కమల్‌కోట్-గుమ్మిర్యాల్‌తండా రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి(ఫైల్)

మామడ: ప్రతి గ్రామాన్ని ఇతర ప్రాంతాలతో అనుసంధానిస్తూ బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎస్డీఎఫ్ కింద మంజూరు చేసిన నిధులతో పనులు కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలకు రవాణా కష్టాలు తీరనున్నాయి. గిరిజనుల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎస్టీ ఎస్డీఎఫ్(ప్రత్యేక అభివృద్ధి నిధి) కింద నిధులు మంజూరు చేస్తుంది. ఈ పథకం ద్వారా నిర్మల్ నియోజకవర్గంలో 82.2 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు రూ.63.92 కోట్లు మంజూరవగా కొన్నిచోట్ల పనులు ప్రారంభించారు.

ఇటీవల పనులు ప్రారంభం..

జిల్లాలో పలు గిరిజనతండాల్లో సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లి రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఎస్డీఎఫ్ నిధులతో ప్రధాన రహదారుల నుంచి గిరిజన గ్రామాలకు రోడ్లు నిర్మించనుండటంతో తండవాసుల కష్టాలు తీరనున్నాయి.

మామడ మండలంలో..

మామడ మండలంలోని శాంతినగర్‌తండా నుంచి భాగ్యనగర్ గ్రామం వరకు, గిరిజన గ్రామాలైన గాయిద్‌పల్లి నుంచి బూరుగుపల్లి వరకు బీటీ రోడ్డు, కమల్‌కోట్ నుంచి నిజామాబాద్ జిల్లాలోని గుమ్మిర్యాల్‌తండా వరకు 6.7 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.5.18కోట్ల నిధులు మంజూరవగా ఇటీవల పనులను నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు.

మామడ మండలంలోని కమల్‌కోట్ గ్రామం నుంచి గుమ్మిర్యాల్‌కు మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇందులో కిలోమీటర్ దూరం బ్రిడ్జి వరకు రోడ్డు నిర్మించలేదు. రోడ్డు లేక న్యూటెంబుర్ని మీదుగా పది కిలోమీటర్లు ప్రయాణించి గుమ్మిర్యాల్ వెళ్లేవారు. ప్రస్తుతం కమల్‌కోట్- గుమ్మిర్యాల్‌తండా రోడ్డుకు నిధులు మంజూరవడంతో పనులు ప్రారంభమయ్యాయి. ఈ రోడ్డు పూర్తయితే కమల్‌కోట్ గ్రామస్తులకు సమస్య తీరుతుంది.

నిధులు మంజూరైన గ్రామాలివీ..

నిర్మల్ జాతీయ రహదారి నుంచి మామడ మండలం దంజీనాయక్‌తండాకు నిర్మించే ఆరు కిలో మీటర్ల రోడ్డుకు రూ.4.80 కోట్లు మంజూరయ్యాయి. సారంగాపూర్ మండలం కౌట్ల(బి) నుంచి దుప్యాతండాకు నిర్మించే 14.4 కిలోమీటర్ల రోడ్డుకు రూ.11.52 కోట్లు, చించోలి(బి)- గంగాపూర్‌తండాకు మూడు కిలోమీటర్ల మేర నిర్మించే రోడ్డుకు రూ.2.40 కోట్లు, జామ్ నుంచి మహావీర్‌తండాకు నాలుగు కిలోమీటర్ల మేర నిర్మించే రోడ్డుకు రూ.3.20 కోట్లు, సారంగాపూర్-పోచన్న తండాకు ఒకటిన్నర కిలోమీటర్ మేర నిర్మించే రోడ్డుకు రూ.1.20 కోట్లు, నర్సాపూర్(జి)-అంజనీతండా కు నిర్మించే మూడు కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.40 కోట్లు, ఆలూర్-లక్ష్మీపూర్‌తండాకు నిర్మించే కిలోమీటర్ రోడ్డుకు రూ.80 లక్షలు మంజూరయ్యాయి. సారంగాపూర్ మండలం ధని- రాజేశ్వర్‌తండాకు నిర్మించే రెండు కిలో మీటర్ల రోడ్డుకు రూ.1.60కోట్లు, చి ట్యాల్-దిలావర్‌పూర్ రోడ్డుకు నిర్మించే 3.2 కిలోమీటర్ల రోడ్డుకు రూ.రెండున్నర కోట్లు, దిలావర్‌పూర్ మండలం మాటేగాం నుంచి సారంగాపూర్ మండలం ప్యారమూర్‌కు నిర్మించే నాలుగున్నర కిలోమీటర్ల రోడ్డుకు రూ.3.60కోట్లు మంజూరయ్యాయి.

- సారంగాపూర్ మండలం కౌట్ల(బి)-అడెల్లితండాకు మూడు కిలోమీటర్ల రోడ్డు, జామ్-సేవానగర్‌తండాకు 3.2 కిలోమీటర్ల రోడ్డు, జామ్ రోడ్డు- హన్మాన్‌తండాకు 1.20 కిలోమీటర్ల రోడ్డు, బోరింగ్‌తండా -నాగపూర్‌కు రెండున్నర కిలోమీటర్లు. ఈ రోడ్లకు 8.55 కోట్లు మంజూరయ్యాయి.
- కుస్లీ-ప్రేమ్‌నగర్‌తండాకు(1.8 కిలోమీటర్లు), ఆ ర్ అండ్‌బీ రోడ్డు- నారాయణపల్లి (1.7 కిలో మీ టర్లు), సిద్ధులకుంట-సాంగ్వి(ఐదు కిలో మీట ర్లు), భైంసా రోడ్డు నుంచి కాల్వతండా వరకు ని ర్మించే రెండున్నర కిలో మీటర్ల రోడ్డు నిర్మించ నున్నారు. ఈ రోడ్ల నిర్మాణానికి రూ.7.11కోట్లు మంజూ ర య్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తయిందని.. పనులు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.

రోడ్డు సమస్య తీరనుంది



మా గ్రామం నుంచి గుమ్మిర్యాల్‌కు మూడు కిలోమీటర్లు ఉంటుంది. కానీ రోడ్డు లేక పది కిలో మీటర్లు తిరిగి న్యూటెంబుర్ని మీదుగా వెళ్తున్నాం. నిధులు మంజూరవడంతో కమల్‌కోట్-గుమ్మిర్యాల్ రోడ్డు పనులు చేస్తున్నారు. రోడ్డు పూర్తయితే మాకు సమస్య తీరుతుంది.

– ముత్యంరెడ్డి, కమల్‌కోట్ మాజీ సర్పంచ్

పనులు ప్రారంభించాం



ఎస్టీ ఎస్డీఎఫ్ పథకంలో భాగంగా నియోజకవర్గంలోని గ్రామాల్లో 82 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.63.92 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తయింది. గిరిజన తండాలను అనుసంధానిస్తూ ఇప్పటికే పనులు ప్రారంభించాం.

– జాదవ్ భీంసింగ్, ఆర్అండ్‌బీ సబ్‌డివిజన్ డీఈ, నిర్మల్

కాంగ్రెస్ పాలనలోనే రైతులకు సంక్షేమం

- డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు



సారంగపూర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న శ్రీహరిరావు, నాయకులు

మామడ: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే రైతులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పొన్కల్‌లో రుణమాఫీ సంబరాలు నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు స్వీట్లు పంపిణీ చేసి మాట్లాడారు. గంగారెడ్డి, లింగారెడ్డి, పడాల శ్రీనివాస్, సంతోష్, లింగన్న, శేఖర్, నర్సారెడ్డి, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

సారంగపూర్: పంట రుణాలను మాఫీ చేసినందుకు శుక్రవారం రైతులతో కలిసి డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు.. మండల కేంద్రంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రుణమాఫీతో మండలంలో 2,388 మంది రైతులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ డీసీఎంఎస్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, నర్సయ్య, సలీం, అబ్దుల్ హాదీ, మారుతి, సత్యపాల్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రాజన్న, రైతులు తదితరులు ఉన్నారు.

అభివృద్ధిని చూసే చేరికలు

లక్ష్మణచాంద: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసే వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. లక్ష్మణచాంద మండలం తిర్పెల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరగా.. వారికి శ్రీహరిరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో తిర్పెల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు సోన్న భీమేష్, మాజీ ఉప సర్పంచ్ సుంచు లింగన్న, అశోక్, లింగన్న, భూమ్మన్న ఉన్నారు. ఇందులో ఈటెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజల కోసమే ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఏర్పాటు

సారంగపూర్: మండల ప్రజల కోసమే తన తండ్రి కూచాడి భాస్కర్‌రావు జ్ఞాపకార్థం సారంగపూర్‌లో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఏర్పాటు చేయించానని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. వైద్యశాల ఏర్పాటు చేసి ఏడాది కావడంతో శుక్రవారం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలున్నవారు వైద్యశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ డీసీఎంఎస్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, నర్సయ్య, సత్యపాల్‌రెడ్డి, ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



లోకేశ్వరం: పంచగుడి పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఏఎస్సై దిగంబర్, తదితరులు



బాసరలో మొక్క నాటుతున్న అధికారులు

లోకేశ్వరం: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ఏఎస్సై దిగంబర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పంచగుడి-ధర్మోర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఏఎస్సై మాట్లాడుతూ ఇంటి ఆవరణలో, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. వారి వెంట హెచ్‌ఎం సుభాశ్, నారాయణ్‌రెడ్డి, భాస్కర్, నారాయణ్, గంగాధర్ ఉన్నారు.

కుంటాల: మొక్కలు నాటితేనే మానవాళికి మనుగడ ఉంటుందని ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రనాగాకాంత్ పేర్కొన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రతన్‌కుమార్, సగ్గం గంగాధర్, మారుతి, లక్ష్మణ్, చిన్నారెడ్డి, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

బాసర: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శుక్రవారం ఎంపీడీవో అశోక్‌కుమార్, వైద్యాధికారి ఆకాశ్, ఎస్సై గణేశ్ ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలు నాటారు. వైద్యసిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మొక్కలను నాటి రక్షించాలని ఎస్సై సుమలత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పొట్టపెల్లి(కే) హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ఎస్సై గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. కార్యదర్శి శ్రీనివాస్, బీసీలు అశోక్, సంతోష్, వినోద్, శ్రీలత తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

లోలెవెల్ వంతెనపై మరమ్మతులు

నర్సాపూర్(జి): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని తురాటి గ్రామ సమీపంలోని లోలెవెల్ వంతెనపై గుంత ఏర్పడింది. దీంతో గ్రామస్తులు వంతెనపై నుంచి వెళ్లేందుకు భయాందోళన చెందారు. ఈవిషయాన్ని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో తిమ్మాపూర్ (జి) బీజేపీ నాయకుడు, కాంట్రాక్టర్ వినోద్‌రెడ్డి సొంత ఖర్చులతో గుంతను సీసీతో పూడ్చివేశారు. గ్రామస్తులు ఎమ్మెల్యే, కాంట్రాక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హెడ్‌కానిస్టేబుల్‌కు అభినందనలు

భైంసాటౌన్: భైంసా కోర్టు హెడ్‌కానిస్టేబుల్ పాండునాయక్‌ను అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరుణ శుక్రవారం అభినందించారు. ఇటీవల తానూరులో హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిని పట్టుకోవడంలో పాండునాయక్ చురుకుగా వ్యవహరించారు. ఈ మేరకు ఆయన్ను శాలువా, పూలమాలతో సన్మానించి అభినందించారు. కోర్టు సిబ్బంది ఉన్నారు.

ఫైర్ విన్యాసాలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వాసవి పాఠశాలలో అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఫైర్ విన్యాసాలు ప్రదర్శించారు. ఫైర్‌ఆఫీసర్ జయత్‌రామ్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అగ్నిమాపక అధికారులు అజయ్‌కుమార్, హుస్సేన్‌షా తదితరులున్నారు.

సన్మానం

ముధోల్ : మండలంలోని చించాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శుక్రవారం తోటి సిబ్బంది సన్మానించారు. అనంతరం పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను సైతం సన్మానించారు.

కుంటాల: మండలంలోని లింబా(బి) ప్రాథమిక పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు మాణిక్యం, పంచాయతీ కార్యదర్శి టెంబరేణి సుమన్‌తోపాటు బదిలీపై వచ్చిన హెచ్‌ఎం సక్రపు గజేందర్‌ను శుక్రవారం గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లేష్, పీఆర్టీయూ మండల కన్వీనర్ అంబకంటి సతీష్, వీడీసీ చైర్మన్ గంగాధర్, వివేకానంద్ తదితరులు పాల్గొన్నారు.

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన శ్రీధర్ వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారిగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. గ్రామ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అతడిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన వెంకటనరసింహారావు, రజనీకాంత్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంక్షేమ సంఘం గ్రామ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేశ్, సల్కం శేఖర్, కోశాధికారి రాంప్రసాద్, సభ్యులు రవికుమార్, రఘునాథ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



భైంసాలో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే రామారావు పటేల్ పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. భైంసా, నర్సాపూర్ (జి) మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీటీ అశోక్, బీజేపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి)లో..

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం చాక్‌పల్లి, నందన్, బూరుగుపల్లి(జి), తిమ్మాపూర్ (జి) గ్రామాలకు చెందిన ఆరుగురికి శుక్రవారం ఎమ్మెల్యే రామారావు పటేల్ కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినోద్‌రెడ్డి, గోంద్ర సాగర్, శ్రీకాంత్‌రెడ్డి, అర్జున్ ఠాకూర్, నరేందర్, ఎంపీడీవో పుష్పలత, డీటీ వాహీదొద్దీన్, ఆర్ఐ సుమలత పాల్గొన్నారు.

వసతిగృహాల్లో సౌకర్యాలు కల్పించాలి



వసతిగృహంలో మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: వసతిగృహాల్లో సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ(భారత విద్యార్థి ఫెడరేషన్) జిల్లా కార్యదర్శి దిగంబర్ అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ఉన్న ఎస్సీ వసతిగృహం సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా దిగంబర్ మాట్లాడుతూ వసతిగృహాలకు సొంత భవనాలు, సరైన మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వసతిగృహాలు ప్రారంభమై నెల దాటినా దోమతెరలు, బెడ్‌షీట్లు ఇవ్వలేదన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్తీక్, రాహుల్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



బీర్నందిలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది, సుర్జాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి సంబరాలు నిర్వహించారు. రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బొజ్జు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఖానాపూర్ పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వెంకాగౌడ్, జంగిలి శంకర్, రాజునాయక్, శ్రీనివాస్, రాంచందర్, గంగన్న, మల్లేశ్, భీమన్న, రాజన్న తదితరులున్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాందలో రైతులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజేశ్వర్, మాజీ సర్పంచ్ వెంకట్, గ్రామ కమిటీ అధ్యక్షుడు మోహన్, తాండ్ర రాజేశ్వర్, సలీం, అశోక్, శ్రీనివాస్, సాయన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రత పాటించాలి



తానూరు: పరిసరాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

తానూరు: రోగాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. శుక్రవారం డ్రై డేలో భాగంగా మండల కేంద్రంలో పర్యటించారు. పాతటైర్లు, పాత్రల్లో వర్షపునీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మురికి కాలువలను శుభ్రపరిచి గ్రామస్తులకు క్లోరినేషన్ నీటిని అందించాలని సిబ్బందికి సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పంచాయతీ ట్రాక్టర్ ద్వారా తడి, పొడి చెత్త సేకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి జలంసింగ్, ఆశవర్కర్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మండల ఆరోగ్య సమన్వయకర్త శివకృష్ణ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం డ్రైడే ఫ్రై డేలో భాగంగా మండలంలోని పార్‌పెల్లిలో పర్యటించి ఇళ్లలో నిల్వనీటిని పారబోయించారు. మురికి కాలువలను శుభ్రం చేయించారు.పంచాయతీ కార్యదర్శి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో పారిశుధ్య పనులు

నిర్మల్‌టౌన్: డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలకుండా జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్ కాలనీ మహాలక్ష్మివాడలో మున్సిపల్ సిబ్బంది శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి గుంతల్లో ఆయిల్‌బాల్స్, దోమల నివారణ మందు పిచికారీ చేశారు. పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని కౌన్సిలర్ నవీన్ తెలిపారు.

సోషల్ మీడియాకు దూరం ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై సుమలత

లక్ష్మణచాంద: విద్యార్థులు సోషల్ మీడియాకు దూరం ఉంటూ చదువుపై దృష్టి సారించాలని ఎస్సై సుమలత పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సహకార జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ఆమె మాట్లాడారు. ఆకతాయిలు వేధిస్తే 100కు ఫిర్యాదు చేయాలన్నారు. అపరిచితుల నుంచి కాల్స్, మెసేజ్‌లు వస్తే స్పందించొద్దన్నారు. సైబర్ మోసాల బారిన పడితే 1930 నెంబర్‌కు ఫోన్ చేస్తే.. విచారణ జరిపి డబ్బులు రికవరీ చేస్తామని పేర్కొన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే రూ.25వేల జరిమానా విధిస్తామన్నారు. ప్రిన్సి పాల్ భోజన్న అధ్యాపకులు కిష్టయ్య, శ్రీనివాస్, రాజేశ్వర్, ఎస్.భోజన్న, రాజశేఖర్, చంద్రశేఖర్ రవీందర్, స్వరాజ్యం, స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

ఖానాపూర్: రెండున్నర ఏళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పద్మావతినగర్‌లో 'అమ్మమాట అంగన్‌వాడీ బాట'లో భాగంగా ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేశ్, శ్రీపాద శేషాద్రి, తోట భీమేశ్, వరలక్ష్మి, ధనలక్ష్మి, మల్లేశ్వరీ, లక్ష్మి తదితరులున్నారు.

కుంటాల: అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మివిశారద పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని లింబా(బి), లింబా(కే) గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులను పరిశీలించారు. వారి వెంట హెచ్‌ఎం సక్రపు గజేందర్, అంగన్‌వాడీ టీచర్లు గంగామణి, సువర్ణ, సత్తమ్మ తదితరులు ఉన్నారు.

హామీలు నెరవేర్చాలని వినతి

సారంగపూర్: ఎన్నికల వేళ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ముదిరాజ్ సంఘం సభ్యులు శుక్రవారం తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆ సంఘం నాయకులు మోహన్, బోండ్ల రమేశ్ మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ-ఏలో చేర్చాలన్నారు. ముదిరాజ్‌ల అభివృద్ధికి ఏటా వెయ్యికోట్ల సంక్షేమ నిధి ఏర్పాటు చేసి మత్స్యసంపదపై తమకు హక్కులు కల్పించాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో దోడ నర్సయ్య, గంగాధర్, తాండ్ర నర్సయ్య, గంగాధర్, నారాయణ తదితరులు ఉన్నారు.

జయంతి

కుంటాల: స్వాతంత్ర్య సమరయోధుడు మంగళ్‌పాండే జయంతిని మండలకేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఇందులో ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఐహిహరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899